సాక్షి
ఖమ్మం
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



డెడ్ స్టోరేజీ స్థాయికి పాలేరు

జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటి మట్టం యాభై ఏళ్ల కనిష్ట స్థాయికి చేరుకోగా దిగువకు నీటి విడుదల నిలిపేశారు. 10లో



ఏసీబీ వలలో హెచ్‌ఎం

'మన బస్తీ – మన బడి' పనుల బిల్లు చెల్లించేందుకు ప్రధానోపాధ్యాయురాలు లంచం డిమాండ్ చేయగా ఏసీబీకి చిక్కారు. 8లో



వాతావరణం

ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్ట స్థాయికి చేరే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున అర్చకులు శ్రీవారికి వేదమంత్రోచ్చరణల నడుమ పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, అర్చకులు, భక్తులు కలిసి శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

6వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వచ్చేనెల 6వ తేదీ వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ విష్ణు ఎస్.వారియర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంక్షలు అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించొద్దని, గుంపులుగా తిరగరాదని సూచించారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నందున ప్రజలు, పార్టీలు, సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఇక నివాస, వాణిజ్య ప్రాంతాల్లో పగలు, రాత్రి పరిమితికి మించి డీజే శబ్దాలతో ఊరేగింపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

కూలీలకు సగటున రూ.257 వేతనం



కాల్వ పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

తల్లాడ/కల్లూరు రూరల్: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ కూలికీ సగటున రూ.257 వచ్చేలా పనులు ఉండాలని డీఆర్డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని రంగంబంజరలో ఎన్నెస్పీ కాల్వ పూడికతీత పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు చేపట్టాలని, వేసవిలో పంట కాల్వలను బాగు చేసుకుంటే సాగునీటి సరఫరాకు అవరోధాలు తొలగిపోతాయని చెప్పారు. ఇక కూలీలకు సగటు వేతనం అందేలా చూస్తూనే, ఉపాధి పనులు ఇంకా ప్రారంభం కాని గ్రామాల్లో వెంటనే చేపట్టాలని ఉద్యోగులకు సూచించారు. ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డి, ఏపీఓ కోటయ్య, వీడీసీ చైర్మన్ ఖాసింబాబు, సిబ్బంది నాగేశ్వరరావు, అఫ్జల్ పాల్గొన్నారు. అలాగే, కల్లూరు రూరల్ మండలం హనుమతండాలో కూడా ఉపాధి హామీ పనులను సర్పంచ్ మోహన్, ఏపీఓ హేమమాలినితో కలిసి డీఆర్డీఓ విద్యాచందన పరిశీలించారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యం



పరీక్ష హాల్‌లో పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖర్‌శర్మ

సత్తుపల్లిటౌన్: పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని డీఈఓ సోమశేఖర్‌శర్మ సూచించారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్, బాలికోన్నత పాఠశాల, బాలుర పాఠశాల, గంగారం దాసరి వీరారెడ్డి ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాలల్లో ప్రీ ఫైనల్ పరీక్షలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు నెల రోజులే గడువు ఉన్నందున వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అదనపు తరగతులు ఏర్పాటుచేయాలని తెలిపారు. అలాగే, మన ఊరు–మన బడి పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని హెచ్‌ఎంలకు సూచించారు. హెచ్‌ఎంలు వీర్ల సరోజిని, యాకోబు, నాగమణి, ఆర్.శైలజ, ఎస్‌సీసీ అధికారి షాకీర్, ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఆదిల్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్ సెల్ నంబర్ 79012 98265

- వాట్సప్ మెసేజ్ చేసినా స్పందిస్తాం
- వీధి కుక్కల సమస్యకు చెక్ పెట్టేలా ప్రణాళిక
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి

సమస్య ఉందా.. ఫోన్ చేయండి!

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని... ఈ సెల్‌కు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయించామని అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి వెల్లడించారు. ఈ సెల్‌కు కేటాయించిన నంబర్ 79012 98265కు ఫోన్ చేసినా, వాట్సప్ ద్వారా మెసేజ్ పంపినా అధికారులు, సిబ్బంది స్పందించి పరిష్కరిస్తారని తెలిపారు. కేఎంసీ పరిధిలో కుక్కల నియంత్రణ కోసం యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ద్వారా స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేస్తున్నామని.. తాజాగా దీనిని మరింత వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఇక నగరంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న కుక్కలు, పారిశుద్ధ్య ఇతర సమస్యలను కేఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు పెద్దసంఖ్యలో ఫోన్లు చేశారు. పలువురితో మాట్లాడిన అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి సమస్యకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా కొందరు ప్రస్తావించిన సమస్యలు, అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

■ ప్రభుత్వ పాఠశాల పక్కన మటన్ షాప్ ఉండడంతో కుక్కలు చేరగా, పిల్లలు స్కూల్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు. – సౌజన్య, మామిళ్లగూడెం

అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ : రెండు రోజుల్లో పాఠశాల వద్ద కుక్కలను బంధించి ఏబీసీ సెంటర్‌కు తరలించి స్టెరిలైజేషన్ చేయిస్తాం. పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది రాకుండా చూస్తాం.

■ పందుల సమస్య వేధిస్తోంది.
– సుదర్శన్‌రావు, శ్రీనగర్ కాలనీ, 12వ డివిజన్

ఏఎంసీ : నగరంలో పందులను ఇటీవల పట్టించాం. పందులను రోడ్లపైకి వదిలే పెంపకందారులకు జరిమానా విధిస్తున్నాం. మరోసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

■ కోతులతో బయటకు రావాలంటే భయపడుతున్నాం.
– సరళ, దానవాయిగూడెం / శ్రీదేవి, ఖానాపురం

ఏఎంసీ : నగరంలో కోతులను పట్టించి బయటకు తరలించాం. మరోసారి ఏయే ప్రాంతాల్లో కోతులు ఉన్నాయో గుర్తించి పట్టించేందుకు ఏర్పాట్లు చేస్తాం. కోతుల బెడద ఉంటే ఫొటో తీసి గ్రీవెన్స్ సెల్‌కు నంబర్‌కు వాట్సప్‌కు చేయండి.

■ వీధుల్లో కుక్కలను నియంత్రించండి, పెంపుడు కుక్కలను వీధుల్లోకి రాకుండా పర్యవేక్షించండి
– శ్రీనివాసరావు, శ్రీనివాసనగర్ / పద్మావతి, ముస్తఫానగర్ / లక్ష్మి, వీడీవోస్ కాలనీ / విశాలి / తాళ్లూరి స్వజన్‌కుమార్, 51వ డివిజన్

ఏఎంసీ : నగరంలోని అన్ని డివిజన్లలో కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ చేయిస్తున్నాం. అలాగే, ఖాళీ ఇళ్లు, పాడుబడిన భవంతుల్లో ఉండే కుక్కలను గుర్తించి యానిమల్ డే కేర్ సెంటర్‌కు తరలిస్తాం. పెంపుడు కుక్కలను వీధుల్లోకి వదలకుండా అవగాహన కల్పిస్తాం.

■ మిషన్ భగీరథ పైపులైన్లు వేసినా తాగునీటి అందడం లేదు. – అలీమ్ పాషా, వైఎస్సార్ కాలనీ/ బుద్ధి వెంకటేశ్వర్లు, ఖానాపురం హవేలి

ఏఎంసీ : నల్లా కనెక్షన్లు ఇచ్చి ఉంటే తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తాం. సోమవారం లైన్‌మెన్లు వచ్చి పరిశీలిస్తారు. అలాగే, నీరు వృథా కాకుండా మరమ్మతులు చేస్తాం.

■ నెల రోజులుగా డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు.
– శేఖర్‌బాబు, 24వ డివిజన్/నాగలక్ష్మి, ద్వారకనగర్

ఏఎంసీ : పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే గ్రీవెన్స్ సెల్ నంబర్‌కు తెలపండి. సోమవారం బోనకల్ క్రాస్ రోడ్డు నుండి ముస్తఫానగర్ వరకు, ద్వారకానగర్‌లో రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

■ విద్యుత్ తీగలపై పడుతున్న చెట్ల కొమ్మలను కట్ చేయించండి. – శేషగిరిరావు, 50వ డివిజన్

ఏఎంసీ : డివిజన్లలో రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చెట్ల కొమ్మలను ఇప్పటికే తొలగించాం. మరోసారి సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం.

■ అపార్ట్‌మెంట్ల నుంచి మురుగునీటిని ఖాళీ స్థలాల్లోకి వదులుతున్నారు.
– శ్రీనివాసరావు, శ్రీరాంనగర్/మహ్మద్ ఇర్ఫాన్, టేకులపల్లి

ఏఎంసీ : టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి సమస్యను పరిశీలించడంతో పాటు పరిష్కరిస్తాం. పారిశుద్ధ్య సమస్యలు తెలుసుకునేందుకు డివిజన్లు, టేకులపల్లిలో పర్యటిస్తాం.

■ నల్లా కనెక్షన్లు ఇవ్వడం లేదు.
– కిరణ్ గాంధీ, శ్రీరాంనగర్

ఏఎంసీ : మీ ఫిర్యాదును నమోదు చేసుకున్నాం. ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా నల్లా కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

■ కొన్ని డివిజన్లలో చెత్త సేకరణ ఉచితంగా చేస్తుండగా, మరికొన్ని చోట్ల డబ్బు వసూలు చేస్తున్నారు.
– రాజర్షి, జయనగర్ కాలనీ

ఏఎంసీ : కొన్ని ప్రాంతాల్లో ప్రజలే డబ్బు చెల్లించి, చెత్త ఇచ్చేలా స్వచ్ఛ ఆటోలతో ఒప్పందం కుర్చుకున్నారు. స్వచ్ఛ ఆటోలు లేని ప్రాంతాల్లో కేఎంసీ ఉచితంగా చెత్త సేకరణ చేస్తుంది. రోడ్ల వెంట, కూడళ్లల్లో వ్యర్థాలు వేయకుండా ఆటోలు ప్రతిరోజు ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నాయి. కేఎంసీ సేవలు అందరికీ ఒకేలా అందుతాయి.

ప్రజలకు రుణపడి ఉంటా..



మంత్రి పువ్వాడకు సమస్యలు విన్నవిస్తున్న స్థానికులు

- అభివృద్ధిలో హైదరాబాద్ తర్వాత స్థానం ఖమ్మందే..
- సీఎం కేసీఆర్, కేటీఆర్ ప్రకటించిన నిధులతో సమగ్రాభివృద్ధి
- 'వాడవాడకు పువ్వాడ'లో మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఈస్థాయిలో నిలబెట్టిన ఖమ్మం ప్రజలకు రుణపడి ఉంటానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తూ ఇంటింటికీ వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఇస్తున్నానని తెలిపారు. 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మం 55వ డివిజన్‌లో మంత్రి పువ్వాడ ఇంటింటా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఒకటి, రెండు రోజులు నగరంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఖమ్మం నగరానికి రూ.50 కోట్లు, మున్నేరుపై తీగల వంతెనకు రూ.180 కోట్లు ప్రకటించగా, మంత్రి కేటీఆర్ వాడవాడకు పువ్వాడలో గుర్తించే సమస్యల పరిష్కారం కోసం రూ.32 కోట్లు ప్రకటించారని తెలిపారు. హైదరాబాద్ తర్వాత ఖమ్మం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి చెప్పారు. ఈసందర్భంగా డివిజన్ ప్రజలు వెల్లడించిన విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య, డ్రెయిన్ల సమస్యల తక్షణమే పరిష్కరించాలని కేఎంసీ ఏఎంసీ మల్లీశ్వరిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మోతారపు శ్రావణి, రాపర్తి శరత్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, విద్యుత్ ఏడీఈ రమేష్‌తో పాటు బత్తుల మురళి, మోతారపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాల స్వామిని దర్శించుకున్న మంత్రి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గంపలగూడెం మండలం నెమలి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను అర్చకులు వేద మంత్రాలతో స్వాగతించగా, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎంపీలు పార్థసారధిరెడ్డి, నామా



అడసర్లపాడులో పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీలు పార్థసారథిరెడ్డి, నామా, ఎమ్మెల్యే సండ్ర

వేంసూరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తూ నేరుగా నిధులు విడుదల చేస్తోందని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని చౌడవరం, రాయుడుపాలెం, కల్లూరుగూడెం, రామన్నపాలెం, మొద్దులగూడెం, అడసర్లపాడు, భీరపల్లి గ్రామాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి పర్యటించిన వారు సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేయడంతో పాటు నిర్మాణం పూర్తయిన వాటిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ బండి పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి ప్రయోజనం కలిగేలా పనులు చేపడతానని తెలిపారు. రైతులు తన దృష్టికి తీసుకొచ్చిన లిఫ్ట్ పనులు పూర్తయ్యేలా నిధులు మంజురు చేస్తానని చెప్పారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నిక ముందు తప్పుడు వాగ్దానాలతో వచ్చే వారిని తరిమికొట్టాలని సూచించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా, దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా రూ.12 కోట్లతో 65 కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత, వైస్ ఎంపీపీ దొడ్డా శ్రీలక్ష్మితో పాటు పాలా వెంకటరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, గొర్ల ప్రభకర్‌రెడ్డి, మందపాటి సత్యనారాయణరెడ్డి, మిరియాల ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు డీఏఓ పరీక్ష

- జిల్లాలో 27 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పావు గంట ముందు వరకే అనుమతి



ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ల(డీఏఓ) నియామకానికి ఆదివారం రాతపరీక్ష జరగనుంది. ఈమేరకు జిల్లా నుంచి 9,456మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం 27కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్ష 10నుంచి 12–30 గంటల వరకు జరగనుండగా అభ్యర్థులను 8–30 నుంచి 9–45గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. అలాగే, మధ్యాహ్నం పరీక్ష 2–30నుంచి 5గంటల వరకు జరగనుండగా 2–15గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. ఐదు ప్రభుత్వ, 22 ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్, ఆరుగురు లైజనింగ్ అధికారులు, 27మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ తెలిపారు.

ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్లపై పొందుపర్చిన సూచనలు పాటించాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది లేదని తెలిపారు. అలాగే, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డుల్లో ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. కేంద్రాల వద్ద ఆంక్షలు అమల్లో ఉన్నందున ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు. అలాగే, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: డీఏఓ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. వివిధ పట్టణాల నుంచి ఖమ్మంకు ఇరవై బస్సులతో పాటు జిల్లా కేంద్రంలో పది సిటీ సర్వీసులు నడిపిస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం ఖమ్మం సిటీ బస్టాండ్, కొత్త బస్టాండ్లలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సాగునీటి కోసం ఆందోళన



సీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

ఖమ్మంఅర్బన్: ఆరుగాలం కష్టించి, రూ.వేలల్లో పెట్టుబడి పెట్టిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని, ఇకనైనా సాగర్ ఆయకట్టు చివర భూములకు సాగునీరు అందించి కాపాడాలని ముదిగొండ మండలం వల్లాపురం, గంధసిరి గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు పలువురు రైతులు, రైతు సంఘం నాయకులతో కలిసి శనివారం ఖమ్మంలోని జల వనరులశాఖ సీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారబందీ విధానం ఎత్తేసి చివరి ఆయకట్టుకు నీరు చేరేలా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొందరు రైతులు పురుగుల మందు డబ్బాలతో రావడంతో ఉద్రిక్తత నెలకొంది. సుమారు ఆరు గంటల పాటు ఆందోళన సాగగా పోలీసులు చేరుకుని రైతులకు నచ్చచెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నాయని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారబందీ విధానం ఎత్తేయాలని కోరుతుండగా, పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గిందని చెబుతూ మొత్తానికే నీటి విడుదల ఆపేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఈ శంకర్‌నాయక్‌కు ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు వాసిరెడ్డి ప్రసాద్, గోపాల్‌రావు, సురేష్, రమేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య

పెనుబల్లి : విద్యుత్తు పవర్ గ్రిడ్ టవర్‌కు ఉరి వేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఎస్సై జి.సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కొండ్రుపాడుకు చెందిన రేగళ్ల కృష్ణయ్య(63) ఎన్నెస్పీ కాల్వ పక్కన విద్యుత్ టవర్‌పైకి శుక్రవారం రాత్రి ఎక్కి ఉరి వేసుకున్నాడు. దీంతో శనివారం ఉదయం మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, కృష్ణయ్య ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,781

ఏసీబీ వలలో ప్రధానోపాధ్యాయురాలు

- 'మన బస్తీ – మన బడి'బిల్లు చెల్లింపునకు లంచం డిమాండ్
- పాఠశాలలోనే డబ్బు తీసుకుంటూ పట్టుబడిన వైనం
- అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు



హెచ్‌ఎంను విచారిస్తున్న ఏసీబీ అధికారులు, (ఇన్‌సెట్) ఏసీబీకి పట్టుబడిన శ్రీలత

మధిర: నీతి, నిజాయితీ, విలువలపై విద్యార్థులకు బోధించాల్సిన వృత్తిలో కొనసాగుతున్నారు. పాఠాలు చెప్పడమే కాక పాఠశాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించే ప్రధానోపాధ్యాయురాలి పదవిలో ఉన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా రాష్ట్రప్రభుత్వం మన బస్తీ – మన బడి ద్వారా చేపట్టిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాల్సిన ఆమె... పనులు చేసిన కాంట్రాక్టర్‌కు చెక్కు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి పాఠశాలలోనే డబ్బు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలిలా ఉన్నాయి.

కమీషన్ ఇస్తేనే సంతకం..

మధిరలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మన బస్తీ – మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులను విద్యా కమిటీ చైర్మన్ ఎస్.కే.ఫాతిమా సిఫారసుతో కాంట్రాక్టర్ మునుగోటి వెంకటేశ్వరరావు దక్కించుకున్నారు. మొత్తం పనుల విలువ రూ.23,82,059 కాగా, ఇప్పటివరకు సుమారు రూ.14 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇక ఈనెల 3వ తేదీన రూ.7,88,446 చెక్కు వచ్చింది. ఈ చెక్కుపై ఎస్‌ఎంసీ చైర్మన్‌తో పాటు హెచ్‌ఎం మాతంగి శ్రీలత సంతకం చేయాల్సి ఉంది. అయితే, సంతకం చేయాలంటే మొత్తం రూ.23,82,059 విలువైన పనులకు గాను రెండు శాతం కమీషన్ రూ.48వేలకు రూ.2వేలు కలిపి రూ.50వేలు ఇవ్వాలని కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావును డిమాండ్ చేశారు.

ఇరవై రోజులు ఆలస్యంగా...

పనులకు సంబంధించి రూ.7.88లక్ష చెక్కు ఈనెల 3న వచ్చినా హెచ్‌ఎం శ్రీలత సంతకం చేయడం లేదు. తనకు రూ.50వేలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో ఒకేసారి అంత మొత్తం ఇవ్వలేనని కాంట్రాక్టర్ చెప్పడంతో రెండు సార్లు రూ.25వేలు చొప్పున ఇవ్వాలని ఆఫర్ ఇచ్చారు. ఈమేరకు కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అనంతరం అధికారుల సూచనల మేరకు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ హెచ్‌ఎం వాయిస్ రికార్డు చేసి సమర్పించారు. మొదటి విడతగా హెచ్‌ఎం శ్రీలతకు రూ.25వేలు ఇవ్వాలంటే చెక్కు మార్చాల్సి ఉందని చెప్పడంతో ఈనెల 23న హెచ్‌ఎం సంతకం చేసి చెక్కు ఇచ్చారు. ఇక శనివారం ఏసీబీ అధికారుల కనుసన్నల్లో వెంకటేశ్వరరావు తన కుమారుడు రాముకు డబ్బు ఇచ్చి పంపించాడు.

రంగు అంటుతోంది ఏమిటి?

కాంట్రాక్టర్ కుమారుడు రాము రూ.25వేల నగదుతో శనివారం పాఠశాలకు వచ్చి కార్యాలయ గదిలో ఉన్న హెచ్‌ఎం శ్రీలత చేతికి ఇచ్చాడు. ఈక్రమంలో ఆమె డబ్బులు లెక్కిస్తూ చేతికి రంగు అంటుతుందేమిటని ఆరా తీసింది. అయితే, తమ ఇంట్లో ఫంక్షన్ జరగగా పసుపు, కుంకుమ అంటి ఉండొచ్చని చెబుతూ మొత్తం తతంగాన్ని వీడియో తీశాడు. అదే సమయానికి ఏసీబీ అధికారులు గదిలోకి ప్రవేశించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిల్లులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన హెచ్‌ఎం తనను రోజుల తరబడి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. అందుకే ఏసీబీని ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అనంతరం ఖమ్మం ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్టర్ కుమారుడి నుంచి మధిర బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీలత లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తెలిపారు. ఆతర్వాత ఆమె నివాసాల్లో కూడా తనిఖీలు చేశామని వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి హెచ్‌ఎంను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

అప్పు వ్యవహారంలో ఘర్షణ

మార్కెట్‌లో ఆందోళనకు దిగిన రైతులు, వ్యాపారులు



ఇరువర్గాలకు నచ్చచెబుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, పోలీసులు

ఖమ్మంవ్యవసాయం: పంట సాగుకు ఇచ్చిన పెట్టుబడి అప్పు వ్యవహారంపై ఓ కమీషన్ వ్యాపారి, రైతు కుటుంబీకులకు మధ్య ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. ఖమ్మం రూరల్ మండలం తీర్థాలకు చెందిన ధర్మసోత్ మదన్‌కు సాగు కోసం పెట్టుబడిని కమీషన్ వ్యాపారి వడ్డే వెంకటేశ్వర్లు సమకూర్చారు. ఈమేరకు మదన్ సాగు చేసిన 32 బస్తాల మిర్చిని విక్రయించడానికి శనివారం వెంకటేశ్వర్లు వద్దకు కాకుండా మరో వ్యాపారిని ఆశ్రయించాడు. దీంతో ఆయన ప్రశ్నించగా మొదలైన వివాదం ఘర్షణకు దారి తీసింది. అయితే, కమీషన్ వ్యాపారులు తమపై దాడి జరిగిందని గేట్లు మూసివేయగా, పంట కొనుగోళ్లను నిలిపివేయడంపై రైతులు వద్దకు దిగారు. దీంతో పోలీసులు, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఆతర్వాత కమీషన్ వ్యాపారులు, రైతు మదన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, రైతు కుటుంబ సభ్యుల్లో ఒకరు పురుగుల మందు వెంట తెచ్చుకున్నట్లు గుర్తించి పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పి వ్యాపారికి అప్పులు చెల్లించేలా సూచించడంతో గొడవ సద్దుమణిగింది.

పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

పెనుబల్లి : కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేసే అరుదైన శస్త్రచికిత్సను పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన వైద్యులు అభినందనలు అందుకున్నారు. తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన శీలం పద్మావతి కడుపునొప్పితో బాధపడుతూ పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్, సర్జన్ రమేష్‌బాబును సంప్రదించింది. దీంతో పరీక్షించి ఆమె కడుపులో ఎనిమిది కిలోల కేన్సర్ కణితి ఉన్నట్లు నిర్ధారించి, ఆపరేషన్ చేసి తొలగించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేని తమకు చికిత్స చేసిన వైద్యులకు పద్మావతి భర్త నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎనస్తీషియా వైద్యుడు అశోక్, సిబ్బంది కె.శోభారాణి, టి.లక్ష్మి పాల్గొన్నారు.

4, 5వ తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్



సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా లక్ష్మణ్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలో వచ్చే నెల 4, 5వ తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్టా లక్ష్మణ్ వెల్లడించారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యావ్యవస్థను పాలకులు తమ విధానాలతో భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో తొమ్మిదేళ్లుగా విద్యారంగానికి సరైన బడ్జెట్ కేటాయించకపోగా, కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరించాలని చూస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యాన ఖమ్మంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పాలకుల విధానాలపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణతో పాటు యువరాజ్, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు

టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: గిరిజన సమస్యల పరిష్కారమే అజెండాగా తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) పోరాడుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరాంనాయక్ తెలిపారు. సంఘం జిల్లా మూడో మహాసభ కారేపల్లిలో శనివారం ఏర్పాటుచేయగా బానోత్ బాలాజీ అధ్యక్షత వహించారు. ఈ సభలో శ్రీరాంనాయక్ మాట్లాడుతూ తండాల అభివృద్ధికి కర్ణాటక తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, కేంద్రంలోని బీజేపీ గిరిజనుల అభివృద్ధి చేసిందేమీ లేదని ఆరోపించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు తెలిసిన సీఎం కేసీఆర్ పోడు భూమికి పట్టాలు ఇవ్వడానికి నిర్ణయించారని తెలిపారు. తొలుత గిరిజన మహిళలు సంప్రదాయ వస్త్రధారణ, ఆటపాటలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రంతో పాటు సంఘం, వివిధ పార్టీల నాయకులు బండి రమేష్, మూడు శోభన్, ధర్మసోత్ రామునాయక్, భూక్యా దేవిలాల్‌నాయక్, బానోత్ బన్సీలాల్, ఇందిరాజ్యోతి, కుర్సం సత్యనారాయణ, బానోత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసన



ఖమ్మంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు



సత్తుపల్లి టౌన్: నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్/సత్తుపల్లి టౌన్: కేంద్ర కార్యవర్గం పిలుపు మేరకు జిల్లా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజైన శనివారం కూడా నిరసనలు తెలిపారు. ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయం ఎదుట జేఏసీ చైర్మన్ తెక్కలపల్లి శేషగిరిరావు, హీరాలాల్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులు నిరసన చేపట్టారు. పీఆర్‌సీ ప్రకటించాలని నినదించారు. నాయకులు సీహెచ్.రఘోత్తమరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవికుమార్, ఎం.ప్రసాద్, హారిక, భవాని, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే, సత్తుపల్లి డివిజన్ కార్యాలయం ఎదుట కూడా విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగులు డీఏవీ.ప్రసాద్, యు.శరత్‌బాబు, ఎం.షణ్ముకాచారి, వంశీకృష్ణ, సుజాత, రాంబాబు, అస్రఫ్ ఉన్నీసా, వి.మానస, జె.నరేష్, ఎం.రాము, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి గుర్తింపు

కారేపల్లి: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు వెల్లడయ్యాయి. కారేపల్లిలోని పేరుపల్లి రైల్వే గేట్ సమీపాన శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా, మృతుడు ఏన్కూర్ మండలం రేపల్లేవాడకు చెందిన మార్కపూడి నరసింహారావు (40)గా స్థానికులు గుర్తించారు. కారేపల్లికి చెందిన నాగవెల్లి ప్రభాకర్ బావమరిది అయిన నరసింహారావు కొంతకాలంగా కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతుండగా, కారేపల్లి వచ్చిన ఆయన రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, ఘటనపై శనివారం కేసు నమోదు చేసిన డోర్నకల్ రైల్వే పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పప్పులో నిద్రమాత్రలు కలిపి..


- మత్తులోకి జారుకున్నాక వ్యక్తిని హత్య చేసిన భార్య, ప్రియుడు
- బాతుల పెంపకందారుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

చింతకాని: వారిద్దరికి వేర్వేరుగా పెళ్లిళ్లయ్యాయి. ఆతర్వాత ఒకటయ్యారు. మళ్లీ ఆమెకు ఇంకో వ్యక్తితో వివాహేతర సంబంధం మొదలైంది. ఆయననే పెళ్లాడాలనుకున్న ఆ మహిళ ప్రియుడితో కలిసి భర్త హత్యకు పాల్పడింది. తినే కూరలో నిద్రమాత్రలు కలిపి ఆయన గాఢనిద్రలోకి జారుకున్నాక ప్రియుడిని పిలిపించి హత్య చేయించింది. గత బుధవారం జరిగిన ఈ ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేయగా వైరా సీఐ సురేష్ శనివారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం రుద్రకోటకు చెందిన పేరం వెంకటేశ్వర్లు(46) బాతుల పెంపకంతో జీవనోపాధి సాగిస్తున్నాడు. ఆయన సమీప బంధువుతో వివాహం జరగగా కొన్నాళ్లకు విడిపోయారు. ఈక్రమంలో ముగ్గురు పిల్లలు జన్మించాక భర్తను వదిలేసిన మరియమ్మతో ఆయనకు ఏర్పడిన పరిచయం బంధానికి దారితీసింది. వీరిద్దరు కలిసి జీవిస్తూ బాతుల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నారు. అయితే, బాతులను ఓ ప్రాంతం నుంచి ఇంకో చోటకు తరలించేందుకు డీసీఎం వాహనాన్ని ఉపయోగిస్తుండగా కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన దుగ్గిరాల శివకృష్ణ డ్రైవర్‌గా వచ్చాడు. ఈక్రమంలో ఆయనకు మరియమ్మ పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. ఇక వీరిద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని అడ్డుగా ఉన్న వెంకటేశ్వర్లు హత్యకు పథకం పన్నారు.

నిద్రలోకి జారుకున్నాక...

ఇటీవల బాతులను తీసుకుని వెంకటేశ్వర్లు, మరియమ్మ చింతకాని మండలం చినమండవ ప్రాంతానికి వచ్చి పొలాల్లో గుడిసె వేసుకున్నారు. దీంతో పథకం అమలులో భాగంగా గత బుధవారం రాత్రి వెంకటేశ్వర్లు తినే పప్పు కూరలో మరియమ్మ ఎనిమిది నిద్రమాత్రలు కలిపింది. ఆతర్వాత వెంకటేశ్వర్లు గాఢనిద్రలోకి జారుకోగా అర్ధరాత్రి వచ్చిన శివకృష్ణ.. వెంకటేశ్వర్లు ముఖంపై దిండు పెట్టి శ్వాస ఆడకుండా చేసి చంపాలని యత్నించాడు. అది సాధ్యం కాకపోవటంతో వెంకటేశ్వర్లు తలపై మట్టిగడ్డతో కొట్టి పరారయ్యాడు. ఆతర్వాత ఏమీ తెలియనట్లుగా మరియమ్మ గ్రామీణ వైద్యుడిని తీసుకొచ్చేలోగా వెంకటేశ్వర్లు మృతి చెందాడు. దీంతో గురువారం ఉదయం పోలీసులు చేపట్టిన విచారణలో శివకృష్ణ హత్య చేసినట్లుగా చెప్పిన మరియమ్మ వెళ్లిపోయింది. కానీ అప్పటికే శివకృష్ణ పరారీలో ఉండడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఇంతలోనే శుక్రవారం సాయంత్రం శివకృష్ణను కలిసిన మరియమ్మ మత్కేపల్లిలోని తమ బంధువుల వద్ద ఉన్న పిల్లలను చూసేందుకు వస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం నిందితులను రిమాండ్ తరలించినట్లు సీఐ వివరించారు.

కోతుల బెడదకు చెక్!



ఎలుగుబంటి వేషధారణలో రాజేష్

వైరారూరల్: వైరా మండలంలోని పాలడుగులో కోతుల సంఖ్య విపరీతంగా పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కోతులు ఇళ్లు, షాపుల్లోని సామగ్రి లాక్కెళ్తుండడమే కాక పంటలను పాడు చేస్తున్నాయి. దీంతో సర్పంచ్ శీలం రమాదేవి, పంచాయతీ కార్యదర్శి కుమార్ శనివారం మధిర నుంచి ఎలుగుబంటి తరహా దుస్తులు తెప్పించారు. ఈ దుస్తులను మల్టీపర్పస్ ఉద్యోగి రాజేశ్‌కు వేయించగా, ఆయన వీధుల్లో కోతులు, కుక్కలను బెదరగొట్టారు.

మెడికల్ కాలేజీ హాస్టల్ రెడీ



ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరైన నేపథ్యాన ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని మెడికల్ కాలేజీకి కేటాయించడంతో బాలుర హాస్టల్‌గా బోర్డు ఏర్పాటుచేశారు.

ఐదేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో ఐదేళ్ల బాలుడు ముదిగొండ కృష్ణకౌషిక్‌పై శనివారం ఓ వీధి కుక్క దాడి చేసింది. ఇంటి బయట కౌషిక్ ఆడుకుంటుండగా అకస్మాత్తుగా వచ్చిన కుక్క ఆయన చేతిని కొరికింది. దీంతో స్థానికులు కుక్కను అదిలించి బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సెల్లార్‌లో వ్యక్తి మృతి



ఖాదర్‌మియా మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం ముస్తఫానగర్ పోలాస్ వద్ద సెల్లార్‌లో మృతి చెందిన ఖాదర్‌మియా(45) మృతదేహాన్ని వన్ టౌన్ పోలీసులు శనివారం గుర్తించారు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడని స్థానికుల ద్వారా తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కుటుంబీకులకు సమాచా రం ఇచ్చినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



షేక్ హబీబ్ (ఫైల్)

మధిర: మండలంలోని మాటూరు బీసీ కాలనీ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన షేక్ హబీబ్(24) మధిరలోని చికెన్ షాపులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన మోటార్ సైకిల్‌పై మాటూరు నుంచి మధిరకు వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ ఎస్సై నరేష్ తెలిపారు.

స్నేహితుడిని కత్తితో పొడిచి..
తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో యువకుడి దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి


నిందితుడు హరిహర కృష్ణతో జీవన్ (సర్కిల్‌లో)

అబ్దుల్లాపూర్‌మెట్/కల్వకుర్తి టౌన్/ చారకొండ/ ఎంజీయూ (నల్లగొండ రూరల్)/ నార్కట్‌పల్లి: అతను స్నేహితుడు.. కానీ తాను ప్రేమించిన యువతికి దగ్గర అవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు.. మనసులో కక్ష పెంచుకున్నాడు.. ఫ్రెండ్స్‌తో గెట్ టుగెదర్ ఉంది రమ్మని పిలిచాడు.. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో పొడిచి చంపేశాడు.. తర్వాత గుండె, తల, మొండెం, కాళ్లు చేతులను వేరుచేసి.. వాటి ఫొటోలను వాట్సాప్ ద్వారా ప్రియురాలికి పంపి పైశాచికానందం పొందాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో శనివారం ఆలస్యంగా వెలుగు చూసిన దారుణ ఘటన ఇది. హతుడు, నిందితుడు ఇద్దరూ స్నేహితులు, ఇంజనీరింగ్ విద్యార్థులు కావడం, ప్రేమ విషయం హత్యకు దారితీయడం కలకలం రేపింది.

ఇంటర్ నుంచీ స్నేహితులు..

పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని వంకరాయి తండాకు చెందిన నేనావత్ శంకర్ కుమారుడు నేనావత్ నవీన్ (20), వరంగల్‌కు చెందిన పేరాల ప్రభాకర్ కుమారుడు పేరాల హరిహరకృష్ణ (21) ఇద్దరూ స్నేహితులు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీఎల్ కాలేజీలో కలిసి ఇంటర్ చదివారు. తర్వాత హరిహరకృష్ణ పీర్జాదిగూడలోని అరోరా కళాశాలలో.. నవీన్ నార్కట్‌పల్లిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బీటెక్‌లో చేరారు. అయినా తమ స్నేహాన్ని కొనసాగిస్తూ వచ్చారు. అయితే ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే హరిహరకృష్ణ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. నవీన్ కూడా అదే యువతిని ఇష్టపడ్డాడు. సదరు యువతి కూడా కొంతకాలం నుంచి తనను దూరం పెడుతూ నవీన్‌తో చనువుగా ఉండటాన్ని హరిహరకృష్ణ జీర్ణించుకోలేకపోయాడు. నవీన్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయానికి వచ్చాడు.

ముందుగానే ప్లాన్ చేసుకుని..

నవీన్‌ను అంతమొందించాలని రెండు నెలల నుంచే ప్లాన్ చేసుకున్న హరిహరకృష్ణ.. ఈ నెల 17న ఇంటర్ ఫ్రెండ్స్ గెట్ టు గెదర్ ఉందని, రావాలని నవీన్‌కు ఫోన్ చేశాడు. ఇది నమ్మిన నవీన్ యూనివర్సిటీ నుంచి హైదరాబాద్‌కు వచ్చి హరిహరకృష్ణను కలిశాడు. కాసేపు ఇద్దరూ బైక్‌పై కలిసి తిరిగారు. సాయంత్రం మద్యం తీసుకుని బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. మద్యం తాగుతూ మాట్లాడుకున్నారు. ఈ సమయంలో ప్రేమించిన యువతి విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అప్పటికే ప్లాన్ ప్రకారం పదునైన కత్తి తెచ్చుకున్న హరిహరకృష్ణ దానితో దాడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న నవీన్ దీనిని ప్రతిఘటించలేకపోయాడు. తీవ్ర ఆవేశంలో ఉన్న హరిహరకృష్ణ కత్తితో నవీన్ తలను, కాళ్లు, చేతులు, ప్రైవేట్ పార్ట్స్‌ను కోసి ముక్కలు చేశాడు. ఛాతీ భాగాన్ని చీల్చి గుండెను బయటికి తీశాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మరో స్నేహితుడి ఇంటికి వెళ్లి.. స్నానం చేసి..

నవీన్‌ను హత్య చేసిన తర్వాత హరిహరకృష్ణ నేరుగా హాసన్ అనే మరో స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. కాస్త టెన్షన్‌గా కనిపించడంతో ఏం జరిగిందని హాసన్ ప్రశ్నించినా ఏమీ లేదంటూ.. బాత్రూంలోకి వెళ్లి స్నానం చేసిన వచ్చాడు. తర్వాత హత్య గురించి హాసన్‌కు చెప్పాడు. దీనితో భయపడిన హాసన్ వెంటనే వెళ్లి పోలీసులకు లొంగిపోవాలని సూచించగా.. తెల్లారాక వెళ్తానని చెప్పి, అక్కడే నిద్రపోయాడు. మరునాడు మూసారాంబాగ్‌లోని తన సోదరి మమత ఇంటికి వెళ్లాడు. నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నాడు.

ఏమీ తెలియనట్టు నటిస్తూ..

ఈ నెల 16న యూనివర్సిటీ నుంచి బయటికి వచ్చినప్పటి నుంచీ నవీన్ ఆచూకీ తెలియకపోవడంతో.. అతడి కుటుంబ సభ్యులు గాలించడం మొదలుపెట్టారు. హరిహరకృష్ణను కలిసి ఏం జరిగిందని నిలదీశారు. అయితే ఓ యువతి విషయంలో తమ మధ్య గొడవ జరిగినది నిజమేనని, కానీ తర్వాత ఇద్దరం కలుసుకున్నామని హరిహరకృష్ణ చెప్పాడు. నవీన్ నార్కట్‌పల్లికి వెళ్తానంటే విజయవాడ జాతీయ రహదారిపై దింపేసి తాను హైదరాబాద్‌కు వెళ్లిపోయానని వివరించాడు. నవీన్ కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం రాకుండా అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నప్పుడువారి వెంటే ఉంటూ నమ్మించాడు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చాడని నవీన్ స్నేహితులు తెలిపారు.

అన్నివైపులా ఒత్తిడి పెరగడంతో..

నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్న హరిహరకృష్ణ తర్వాత విశాఖపట్నంతోపాటు పలు ప్రాంతాల్లో తిరిగాడు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చి ప్రియురాలికి ఫోన్ చేసి పిలిపించుకుని మాట్లాడాడు. నవీన్‌ను హత్య, ఇతర అంశాలను ఆమెకు వివరించగా.. పోలీసులకు లొంగిపోవాలని ఆమె చెప్పినట్టు తెలిసింది. మరోవైపు హరిహరకృష్ణను కలవడానికి వెళ్లిన నవీన్ ఆచూకీ లేకపోవడం, హరిహరకృష్ణ ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుండటంతో.. నవీన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిహరకృష్ణ కుటుంబ సభ్యులనూ ప్రశ్నించారు. ఇలా అన్నివైపులా ఒత్తిడి రావడంతో హరిహరకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసులు అతడిని శనివారం రాత్రి హయత్‌నగర్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. కాగా.. నవీన్ హత్యకు హరిహరకృష్ణ ఒక్కడే పాల్పడ్డాడా, మరెవరైనా ఉన్నారా అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ హత్యకు గురైన రోజు హరిహరకృష్ణతోపాటు మరో స్నేహితుడైన జీవన్ కూడా తన బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ వరకు వచ్చినట్టు తెలిసింది. అతను వెళ్లిపోయాక హత్య జరిగిందా? కలిసే హత్య చేశారా అన్నదానిపై ఆరా తీస్తున్నారు.

నవీన్ కుటుంబ సభ్యుల ఆందోళన

నిందితుడు హరిహరకృష్ణను కఠినంగా శిక్షించాలంటూ నవీన్ కుటుంబ సభ్యులు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని.. నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దొరకకుండా జాగ్రత్తపడి..

నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ ఆధారాలు దొరకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహంపై డ్రెస్‌ను తొలగించి దూరంగా పడేశాడని.. హత్యచేసి, శరీర భాగాలను కోసిన సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకున్నాడని వివరించారు. అలాగే ఎలాంటి ఆధారాలు దొరక్కుండా తనకు చెందిన రెండు ఫోన్లలోని డేటా మొత్తాన్ని తొలగించినట్టు సమాచారం.

విషాదంలో వంకరాయి తండా

నవీన్ హత్య విషయం తెలియడంతో అతడి స్వగ్రామం వంకరాయితండాలో విషాదం అలుముకుంది. నవీన్ తండ్రి శంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి వసంత కూలిపనులకు వెళ్తుంది. గ్రామం నుంచి కల్వకుర్తికి వలస వచ్చిన వారిద్దరూ.. కష్టపడి పనిచేస్తూ కుమారుడిని ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు దారుణంగా హత్యకు గురికావడంతో కన్నీటిలో మునిగిపోయారు. పోలీసులు శనివారం సాయంత్రం నవీన్ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రికి వంకరాయితండాలో అంత్యక్రియలు నిర్వహించారు.


నవీన్ స్వగ్రామం వంకరాయి తండాలో విషాదఛాయలు

20 మీటర్లకు ఓ ముక్క.. యువతికి వాట్సాప్‌లో ఫొటోలు!

పోలీసులు లొంగిపోయిన హరిహరకృష్ణను ఘటనా స్థలానికి తీసుకెళ్లి విచారించారు. మద్యం మత్తులోనే నవీన్‌ను హత్య చేసినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నవీన్ శరీరాన్ని ముక్కలుగా చేశాక.. 20 మీటర్లకో భాగాన్ని దూరదూరంగా పారేసినట్టు తేల్చారు. ఆ భాగాలను పోలీసులు సేకరించి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఇక నవీన్‌ను కిరాతకంగా చంపిన హరిహరకృష్ణ.. అతడి శరీర భాగాలను ఫొటోలు తీసి ప్రేమించిన యువతికి, పలువురు ఇంటర్ స్నేహితులకు వాట్సాప్ ద్వారా పంపినట్టు తెలిసింది.

పథకం ప్రకారమే హత్య

నవీన్ హత్య పథకం ప్రకారమే జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. నిందితుడు తన వెంట పదునైన కత్తిని తీసుకుని వచ్చాడంటే అది క్షణికావేశంలో జరిగిన హత్యగా కనిపించడం లేదు. కొంతకాలంగా నవీన్‌పై హరిహరకృష్ణ పెంచుకున్న పగే ఈ హత్యకు దారితీసినట్టు తెలుస్తోంది. దర్యాప్తులో అన్ని విషయాలు తేలుస్తాం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తాం.

– సాయిశ్రీ, డీసీపీ ఎల్బీనగర్

మల్లన్న సేవలో సీజేఐ


ఆలయం వద్ద సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కి స్వాగతం పలుకుతున్న దేవస్థానం చైర్మన్ తదితరులు

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనుంజయ వై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, అర్చక స్వాములు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి దంపతులు రత్నగర్భ స్వామిని, తర్వాత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని, భ్రమరాంబాదేవి అమ్మ వారిని దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమల చూపు ఏపీ వైపు

- 44 నెలల్లో వాస్తవ రూపంలోకి రూ.75,649.77 కోట్ల పెట్టుబడులు
- ఇందులో భారీ, మెగా యూనిట్ల రూపేణా రూ.56,534.53 కోట్లు

సాక్షి, అమరావతి: పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోని దిగ్గజ సంస్థలు పారిశ్రామిక అనుకూల విధానాలున్న ఏపీ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ సంస్థలు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్ వంటి పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన వచ్చింది.

14,36,992 మందికి ఉపాధి

సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టాక 2019 జూన్ నుంచి 2023 జనవరి వరకు రూ.75,649.77 కోట్ల విలువైన పెట్టుబడులు (ఎంఎస్ఎంఈ సహా) వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇందులో 111 భారీ, మెగా యూనిట్లు రూ.56,534.53 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 73,876 మందికి ఉపాధి లభించింది. అంటే సగటున ఏడాదికి రూ.15,418 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి మొదలైంది. ఇందులో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా రూ.13,766 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఆరు యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి లభించింది. ఇవి కాకుండా రూ.7,305 కోట్ల విలువైన కియా పరిశ్రమ వాణిజ్య పరమైన ఉత్పత్తిని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2019 డిసెంబర్ 5న లాంఛనంగా ప్రారంభించారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ రంగంలో 1,52,558 కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.19,115.24 కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా 13,63,706 మందికి ఉపాధి లభించింది. ఇవికాకుండా మరో 86 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,35,125.60 కోట్ల విలువైన పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కూడా వాస్తవ రూపంలోకి వస్తే 2,36,806 మందికి ఉపాధి లభించనుంది.

ప్రకృతి సాగులో ఏపీ ఆదర్శం

కేంద్రం ప్రశంసలు.. సామాజిక ఆర్థిక సర్వేలో ప్రస్తావన

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏపీలో ఉద్యమంలా సాగుస్తున్న ప్రకృతి వ్యవసాయానికి అరుదైన గౌరవం దక్కింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇటీవల విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేలో ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రశంసించింది. అన్ని రాష్ట్రాలూ ఏపీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించింది. తొలుత 704 గ్రామాల్లో 40 వేల మందితో ప్రారంభమైన ప్రకృతి సాగు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఓ ఉద్యమంలా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రైతులు కాకుండా ఈ ఉద్యమంలో ఇప్పటివరకు 1.32 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వాములయ్యారు. 1.71 లక్షల మంది పేద, మధ్య తరగతుల ప్రజలు ఇళ్లలో కిచెన్ గార్డెన్లను పెంచుతున్నారు. ఏపీ స్ఫూర్తితో ఈ ఏడాది జాతీయ స్థాయిలో కోటి ఎకరాల్లో ప్రకృతి సాగుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

ఖమ్మంలో రీజియన్ టౌన్ ప్లానింగ్ అధికారులు



మేయర్ నీరజను సన్మానిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్ రీజియన్ పరిధిలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ ఖమ్మం జిల్లాల మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ అధికారులు రీజినల్ డైరెక్టర్ మైఖేల్ ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, గోళ్లపాడు చానల్ పార్కులు, బల్లేపల్లి వైకుంఠధామం, లకారం ట్యాంక్‌బండ్‌తో పాటు పలు కూడళ్లను పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పనులను వారికి వివరించారు.

చికిత్స కోసం వచ్చి.. బస్టాండ్‌లో మృతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కొత్త బస్టాండ్‌లో శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారానికి చెందిన మంచిన లింగయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం బంధువులు ఖమ్మం తీసుకొచ్చారు. ఈమేరకు కొత్త బస్టాండ్‌లో బస్సు దిగాక ఆయన కుర్చీలో కూర్చుకుంటేనే కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో బంధువులు ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పర్ణశాలలో పనులను పరిశీలించిన ఈఓ


పనులను పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పనులను భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి శనివారం పరిశీలించారు. ఆలయంలో ఆదివారం నుంచి రాజగోపురం, విశ్రాంతి మండపం, ఉపాలయాలకు శిఖర ప్రతిష్ఠాపన పూజలు జరగనున్నాయి. ఈ మేరకు పనులను పరిశీలించిన ఈఓ ఏర్పాట్లపై ఉద్యోగులకు సూచనలు చేశారు.

జిల్లా వార్తలు

డెడ్ స్టోరేజీ స్థాయికి పాలేరు

- పైనుంచి తగ్గుతున్న ఇన్‌ఫ్లో
- 13.60 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- దిగువకు నీటి విడుదల నిలిపేసిన అధికారులు



పాలేరు రిజర్వాయర్ ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ వద్ద పడిపోయిన నీటిమట్టం (ఇన్‌సెట్) రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న సీఈ శంకర్‌నాయక్, అధికారులు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి: ఖమ్మం జిల్లాలో ప్రధాన నీటి వనరు అయిన సాగర్ జలాలు నానాటికీ తగ్గుముఖం పడుతున్నాయి. జిల్లాలోని 17 మండలాల పరిధిలో సాగర్ నీటితోనే పంటలు సాగు చేస్తుండగా, గత కొన్నేళ్లుగా ఎదురుకాని ముప్పు ఈసారి ఎదురవుతోంది. ఓపక్క చివరి ఆయకట్టు నీరు అందడం లేదని రైతులు ఇప్పటికే ఆందోళనలు చేస్తుండగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ స్థాయికి చేరింది. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో అధికారులు మిషన్ భగీరథకు నీటి విడుదల కొనసాగిస్తూనే రిజర్వాయర్ ఔట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను శనివారం మూసేశారు.

ఇన్‌ఫ్లో సగానికి పైగా కోత

సాగర్ ప్రధాన కాల్వ నుండి జిల్లా ఆయకట్టుకు రావాల్సిన ఇన్‌ఫ్లోలో సగానికి పైగా కోత పడుతోంది. సాగర్ ప్రధాన కాల్వ నుంచి 11వేల క్యూసెక్కులకు బదులు 8,986 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తున్నారు. ఇందులో ఎగువ జిల్లాల్లో ఆయకట్టుకు వినియోగించుకున్నాక జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు రావాల్సిన 6,400 క్యూసెక్కుల్లో 2,918 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదవుతోంది. ఇక రిజర్వాయర్ నుండి ఆయకట్టుకు 2,740 క్యూసెక్కులు, పాలేరు కాలువకు 245 క్యూసెక్కులతో పాటు మిషన్ భగీరథకు 125.60 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యాన పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి 23అడుగులు కాగా, శనివారం సాయంత్రం 13.60అడుగులకు పడిపోయింది. దీంతో తప్పని పరిస్థితుల్లో అధికారులు మెయిన్ కెనాల్ రెగ్యులేటర్‌ను మూసేశారు. రెండు, మూడు రోజులు పరిస్థితులు పర్యవేక్షించాక నీటి సామర్థ్యానికి అనుగుణంగా మళ్లీ విడుదల చేస్తామని చెబుతున్నారు.

వారబందీకి తోడు మరికొన్ని రోజులు

జిల్లాలో సాగర్ జలాలను వారబంధీ విధానంలో ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటి మట్టం కనిష్ట స్థాయికి పడిపోయిన నేపథ్యాన వారబంధీకి తోడు మరో నాలుగు రోజులు నిలిపివేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటికే మధిర, బోనకల్లు తదితర మండలాల పరిధిలో చివరి ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన బాట పడుతుండగా.. ఇప్పుడు మొత్తానికి నీటి విడుదల ఆపేస్తే ఎలా అనే ఆలోచనకు వచ్చినా తప్పని పరిస్థితుల్లో రెగ్యులేటర్‌ను మూసేశారు. అయితే, పైనుంచి ఇన్‌ఫ్లో పెరిగితే తప్ప సమస్యకు పరిష్కారం లభించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ ఏడాది జలవనరుల శాఖ అధికారులు 2.18లక్షల ఎకరాలకు సాగునీరు అవసరమని ప్రతిపాదించగా.. అనధికారికంగా మరో 50 వేల ఎకరాలు పెరగడంతో సమస్య ఎదురవుతోందని తెలుస్తోంది. అంతేకాక విద్యుత్ సమస్యతో రైతులు బోర్లు, బావుల నీటిని వినియోగించుకోలేక సాగర్ నీటిపైనే ఆధారపడుతుండడం కూడా పాలేరు నీటి మట్టం తగ్గడానికి ఇంకో కారణమని చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం



సాగర్ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. దీనికి తోడు ఎగువ ప్రాంతంలో వాడకం పెరగడంతో పాలేరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తక్కువగా నమోదవుతోంది. ఈ నేపథ్యాన నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరింది. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మిషన్ భగీరథ అవసరాలకు నీటి విడుదల నిలిపేసే పరిస్థితి లేదు. దీంతో రెగ్యులరేటరీని మూసేశాం. ఒకటి, రెండు రోజులు నీటిని నిల్వ చేసి నీటిమట్టం పెరగగానే మళ్లీ విడుదల చేస్తాం.

– శంకర్‌నాయక్, సీఈ, జల వనరుల శాఖ

ఇనుగుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర


వసతి గృహం విద్యార్థినులతో భోజనం చేస్తున్న ఎంపీ రవిచంద్ర


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ వద్దిరాజు

కేసముద్రం: జన్మనిచ్చిన ఇనుగుర్తి గ్రామాన్ని జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంగా ఏర్పాటు చేయించగా.. వారి సహకారంతోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. శనివారం ఇనుగుర్తికి వచ్చిన ఆయన బాలికల వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు తాగునీటి అవసరాల కోసం రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అక్కడే విద్యార్థులతో కలిసి ఎంపీ భోజనం చేశారు. అలాగే, మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి పరిశీలించారు. ఆతర్వాత మన ఊరు–మన బడిలో భాగంగా తన తల్లిదండ్రులైన నారాయణ, వెంకటనర్సమ్మ జ్ఞాపకార్థం రూ.కోటి విరాళం ప్రకటించిన ఎంపీ స్థానిక హైస్కూల్‌ను పరిశీలించి చేయాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, తహసీల్దార్ దిలావర్, సర్పంచ్ దార్ల రాంమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు బ్యాటరీ టెస్ట్


విద్యార్థుల ఎత్తును పరిశీలిస్తున్న అధికారులు


క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు) మోడల్ స్కూళ్లతో పాటు హైదరాబాద్‌లోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో గిరిజన విద్యార్థులకు ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న బ్యాటరీ టెస్ట్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాల్వంచ మండలం కిన్నెరసానిలో మోడల్ స్కూల్‌లో బ్యాటరీ టెస్ట్‌ను ఐటీడీఏ డీడీ.రమాదేవి ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 28వ తేదీ వరకు ఎంపిక పోటీలు జరుగుతాయని, గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, తొలిరోజు 85మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకాగా ఎత్తు, బరువు, క్రీడా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ మాట్లాడుతూ తొమ్మిది అంశాల్లో బ్యాటరీటెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని 40మందిని కిన్నెరసాని, 40మందిని కాచనపల్లి స్కూళ్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడా పాఠశాల హెచ్‌ఎం ఎస్.చందు, పీడీ ఎస్.సుబ్రమణ్యంతో పాటు ఎ.వెంకటేశ్వర్లు, నగేష్, బి.వెంకటేశ్వర్లు, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, రాంబాబు, నాగరాజు, వీరన్న, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం ఎదుట అందరూ సమానమే..

సీనియర్ సివిల్ జడ్జి సురేష్


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

మహబూబాబాద్ అర్బన్: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని చట్టం ఎదుట అందరూ సమానమేనని తెలుసుకోవాలని మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉచిత న్యాయ సాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈసమావేశంలో టౌన్ ఎస్సై దీపికరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ భవాని, న్యాయవాది ఎస్.కే.పాషా, ఉపాధ్యాయులు హిమబిందు, విజయ, స్వర్ణలత, సృజన, స్వరూపరాణి, సంధ్య, కల్పనాదేవి, మంజుల, అరుణ పాల్గొన్నారు.

సీతమ్మవారికి మంగళ సూత్రాలు


మంగళసూత్రాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న పర్ణశాలలోని సీతమ్మ వారికి ఏపీకి చెందిన భక్తులు మంగళ సూత్రాలను శనివారం వితరణగా అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రామభక్త సమాజం బాధ్యులు 17 గ్రాముల బంగారంతో చేయించిన రూ.95 వేల విలువైన మంగళ సూత్రాలకు పూజల అనంతరం అధికారులకు అందించారు. అలాగే, స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి సికింద్రాబాద్‌కు చెందిన వి.ఉదయరాణి రూ.50 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వచ్చే నెల 9నుంచి జాతీయస్థాయి ఎడ్లపోటీలు

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో వచ్చేనెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీ అంకమ్మ తల్లి జాతర జరగనుంది. 1961 లో నిర్మించిన ఈ ఆలయ నిర్వహణ బాధ్యతలను కనమర్లపూడి సైదులు, ఆతర్వాత ఆయన కుటుంబీకులు చూస్తున్నారు. ఈ ఆలయంలో వచ్చే నెల 7నుంచి జరిగే జాతరలో భాగంగా 9, 10, 11వ తేదీల్లో జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం కమిటీలను ఏర్పాటు చేసినట్లు బాధ్యులు వెల్లడించారు.